# వెంటరాని సంపద



ఒకప్పుడు గంగాతీరంలో రత్నపురమనే మహానగరం ఉండేది. ఆ నగరాన్ని రాజధానిగా చేసుకొని నందకుడనే మహారాజు విశాలమైన రాజ్యాన్ని పరిపాలిస్తూ ఉండేవాడు.

రత్నపురం అక్షరాలా రత్నపురమే ! ఆ దేశంలో విశేషంగా బంగారు గనులు, రత్నాల గనులూ ఉండేవి. వాటి అమ్మకాల ద్వారా కోశానికి చాలా డబ్బు చేరుతూ ఉండేది.

మరొకరెవరన్నా రాజుగా ఉన్నట్లయితే,ఆ డబ్బును ప్రజలకోసం వారి సదుపాయాల కోసం ఖర్చుచేసి ఉండేవారు.కాని నందకుడు ఆ పని

చేయలేదు. దేశంలో సంపద పెరుగుతున్న కొద్దీ, ఆ సంపద పట్ల ఆయనకు మమకారం కూడా పెరగ సాగింది. ఒకప్పుడు అమల్లో ఉండిన కవి పండిత పోషణం ఇప్పుడు పూర్తిగా తగ్గిపోయింది. దాన ధర్మాలు కూడా వెనుకటంత భారీగా లేవు. క్రమ క్రమంగా యాచకులు రావడం కూడా మానేశారు.

రాజు కోశానికి కోట్ల విలువైన బంగారం, వజ్రవైడూర్యాలు చేరుతున్న సంగతి ప్రజలకు తెలుసు. వాటి అమ్మకాల ద్వారా ఎంత డబ్బు వసూలు అవుతున్నదో కూడా వారికి తెలుసు. కానీ ఆ సంపదలో ఏ కొంతభాగమూ తిరిగి ప్రజలకు అందడంలేదు. దీంతో ప్రజలు కూడా అసంతృప్తితో మగ్గిపోతున్నారు.

సరిగ్గా ఇలాంటి అవకాశం కోసమే ఎదురుచూస్తున్న శూరసేను డనే రాజు హఠాత్తుగా దాడిచేశాడు. అతని సైనిక శక్తి పెద్దది. నవీన ఆయుధాలు కూడా శూరసేనుని బలగానికి ఉన్నాయి.

రాజ్యాన్నంతా ఆక్రమించుకొంటూ, శూరసేనుని బలాలు రాజధానిని చుట్టుముట్టాయి. కోశాగారం రాజధాని నగరంలోనే ఉన్నది. ఈలోగా ముఖ్యులైన అధికారులందరూ రహస్య మార్గాన రత్నపురిని విడిచిపెట్టారు. రాణివాసం కూడా తరలి వెళ్ళింది. నందకుడు మాత్రం ఆయుధాలు ధరించి కోశాగారం దగ్గరే ఉన్నాడు.

మధ్యాహ్నమయ్యేసరికి శత్రుసైనికులు కోటలో ప్రవేశించారు. మరికాసేపటికి నందకుణ్ణీ, అతని అనుయాయుల్ని సంహరించి

ఖూరసేనుడు కోశాన్ని స్వాధీనం చేసుకొన్నాడు. మిగిలిన సైనికుల్ని నగరాన్ని దోచుకోవడానికి పంపించి తానొక్కడే ఆ ధనకోశం దగ్గర కూచున్నాడు ఖూరసేనుడు.

అంతలోనే అతనికి సన్నగా నవ్వు వినిపించింది.

ఆ నవ్వింది నందకుని కొడుకు కామందకుడు. ఎందుకలా నవ్వావని ఖూరసేనుడు అసక్తిగా అడిగాడు.

"మా నాన్న తన జీవితమంతా ఈ కోశాన్ని నింపడంకోసమే ధారపోశాడు, ఆఖరికి దీని రక్షణలోనే ప్రాణాలు కూడా కోలుపోయాడు. కానీ-వెంట తీసుకెళ్ళిందేమీ లేదు. మరి మీరూ వేలమందిని ఈ కోశం కోసమే బలిపెట్టారు. అంతేకాదు, మా నాన్నగారిలాగ మీరుకూడా ఆ ధనకోశం దగ్గర కాపలా కూర్చున్నారు అయితే, మీరు కూడా వెంట తీసుకెళ్ళగలిగిందేమీ లేదని మీకూ తెలుసు. అయినా ఈ తాపత్రయం ఎందుకో తెలియక నవ్వాను. తప్పయితే మన్నించండి" అన్నాడు కామందకుడు.

ఖూరసేనుని కళ్ళు మూతలు పడ్డాయి. అతనోసారి గొణుగుకొని తలవంచుకొని శాశ్వతంగా ఎటో వెళ్ళిపోయాడు.